# బీజేపీ ఫట్టు.. బీఆర్ఎస్ హిట్టు..

- ముథోల్, ఖానాపూర్, నిర్మల్‌లో కారు జోరు
- జిల్లాలో ఢీలా పడిన కమలం పార్టీ
- కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రమాదేవి
- గులాబీ గూటికి పెంబి జడ్పీటీసీ జానూబాయి
- బీఆర్ఎస్ అభ్యర్థులకు రోజురోజుకూ పెరుగుతున్న మద్దతు

మంచిర్యాల ప్రతినిధి/నిర్మల్, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా ఎన్నికల రణక్షేత్రంలో కమలం పార్టీ పూర్తిగా ఢీలా పడిపోయింది. అభ్యర్థులను ప్రకటించాక ఆ పార్టీలో అసమ్మతి సెగలు భగ్గుమన్నాయి. ముందు నుంచి బీజేపీ కోసం కష్టపడుతూ, నిర్మల్ జిల్లాలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవిని కాకుండా, రామారావు పటేల్‌కు టికెట్ ఇవ్వడంతో ఆమె తీవ్ర మనస్తాపం చెందారు. నమ్మించి గొంతు కోసిన బీజేపీని వదిలి రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో మొన్నే బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే ఖానాపూర్ టికెట్ రమేశ్‌రాథోడ్‌కు ఇవ్వడంతో పెంబి జడ్పీటీసీ జానూబాయి బీఆర్ఎస్‌లో చేరుతానని ప్రకటించారు. ఈ మేరకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో చర్చలు జరిపారు. జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగలడంతో ఆ ప్రభావం జిల్లా కేంద్రమైన నిర్మల్‌లోనూ పడనుంది. దీంతో నిర్మల్‌లో కారుజోరు పెరగ్గా.. కాస్తోకూస్తో ఓట్లు పడుతాయకున్న నియోజకవర్గాల్లో కీలక నాయకులు తిరుగుబాటుతో కమలం కోలుకోలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయింది. మరోవైపు ప్రచారంలో టాప్ గేర్‌లో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థులు.. వివిధ పార్టీల నాయకులను కలుపుకుంటూ ప్రజా మద్దతును కూడగట్టుకుంటూ ముందుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి రమాదేవి



మంత్రి అల్లోలను కలిసిన జానూబాయి

### మరింత పెరగనున్న ఓట్ బ్యాంక్..

ముథోల్ సెగ్మెంట్‌లో కారు దూకుడుకు ప్రతిపక్షాలు బేజారవుతున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకంటి రమాదేవి ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఆమె రాకతో బీఆర్ఎస్‌కు ఇక్కడ మరింత బలపడింది. గత రెండు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన రమాదేవికి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. సమాజ సేవకురాలిగా అనేక మంది పేదలకు అత్యవసర సమయాల్లో ఆమె అండగా నిలిచారు. అంతే కాకుండా మహిళల్లో మంచి పట్టున్న నేతగా కావడంతో ఆమెతో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ మరింత పెరిగినట్లైంది. మరోవైపు ఖానాపూర్ సెగ్మెంట్‌లో బీజేపీ సీనియర్ నాయకురాలు పెంబి జడ్పీటీసీ బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి రాథోడ్‌ను ఓడించాలని ఆమె భావిస్తున్నారు. జానూబాయికి పెంబితో పాటు, కడెం, ఖానాపూర్ మండలాల్లో మంచి పట్టు ఉంది. ఆమె చేరికతో పార్టీకి మరింత బలం చేకూరనుంది. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ చేసినన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే శ్రీరామ రక్షగా నిలుస్తాయని, జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపు నల్లేరు మీద నడకేననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### జన నీరాజనం..

అందరికంటే ముందుగా అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి మంచి స్పందన అభిస్తున్నది. పల్లె పల్లెనా కారు జోష్ కనిపిస్తున్నది. అంచనాలకు మించి ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో అభ్యర్థుల్లో కూడా నూతనోత్సాహం కనిపిస్తోంది. మొదటి నుంచి మృదుస్వభావిగా, చిన్నా, పెద్ద తేడాలేకుండా అందరినీ కలుపుకుపోయే తత్వం ఉన్న నాయకుడిగా విఠల్‌రెడ్డికి మంచి పేరు ఉంది. అలాగే నియోజకవర్గం నుంచి పనుల కోసం హైదరాబాద్ వెళ్లే వారికి ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో భోజన వసతి కల్పించి అవసరమైే పనులను దగ్గరుండి చేసి పెట్టడాన్ని ప్రజలు ఎప్పటికీ గుర్తు చేసుకుంటుంటారు. వీటన్నింటికంటే ముఖ్యంగా గత పదేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులే ఆయన్ని గెలిపిస్తాయంటున్నారు. నిర్మల్ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికే జై కొడుతున్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గత పదేళ్లలో వందల కోట్ల నిధులను తీసుకొచ్చి నియోజకవర్గం రూపురేఖలే మార్చేశారన్న పేరుంది. ఒకవైపు తన నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూనే.. జిల్లా వ్యాప్తంగా అభివృద్ధికి బాటలు వేశారు. నిర్మల్‌ను జిల్లాగా ఏర్పాటు చేయడంలో అల్లోల కృషి మరువలేనిదని ప్రత్యర్థులు సైతం ప్రశంసిస్తున్నారు. అలాగే వందల కోట్లతో గ్రామ గ్రామాన ఆలయాల అభివృద్ధికి కృషి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందంటున్నారు. ప్రతిపక్షాలు ఎన్ని తప్పుడు విమర్శలు చేసినా, మచ్చలేని మనిషి ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపు పక్కా అని చర్చించుకుంటున్నారు. ఇక కాగా ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడనే పేరు ఉంది. దీంతో ఆయన గెలిస్తే కేటీఆర్ సహకారంతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ఇటీవల నిర్వహించిన బహిరంగ సభల్లో సైతం జాన్సన్‌ను గెలిపిస్తే నియోజకవర్గం రూపురేఖలు మార్చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కారణంగానే గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు జాన్సన్ నాయక్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.



జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీలోకి నాయకులు

## గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగరాలే..

- బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్

ఖానాపూర్ రూరల్, నవంబర్ 1: ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పలు గ్రామాల నుంచి వచ్చి పెద్ద సంఖ్యలో యువకులు పార్టీలో చేరి బీఆర్ఎస్ కండువాను కప్పుకున్నారు. బాదనకుర్తి గ్రామాల నుంచి సుమారు 30 మంది పార్టీలో చేరారు. బాదనకుర్తి సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, శనిగారపు శ్రావణ్, పాల సంతోష్, తుప్పా నరేందర్, నగేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంక్షేమానికి ఆకర్షితులయ్యే చేరికలు

- బీఆర్ఎస్ ముథోల్ అభ్యర్థి విఠల్ రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

భైంసా, నవంబర్, 1: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే వివిధ పార్టీల నేతలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సంజీవ్ రెడ్డి ఫ్యాక్టరీలో పుస్పూర్ సేవలాల్ తండాకు చెందిన బీజేపీ నాయకులు ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. సాయి రాథోడ్, బీజేవైఎం యూత్ అధ్యక్షులు, 20 మంది పార్టీలో చేరారు.

# ఓట్ల కోసమే ఆ రెండు పార్టీలు

- ఆదివాసీ యోధులను ఏనాడూ పట్టించుకోలే..
- సీఎం కేసీఆర్ సారథ్యంలోనే ఆదివాసీలకు గుర్తింపు
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- బీఆర్ఎస్ పార్టీలో చేరిన 550 మంది



పార్టీలో చేరిన వారికి కండవా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం, నవంబర్ 1: ఓట్ల కోసమే ఆ రెండు పార్టీలు ప్రజల్లోకి వస్తున్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు.జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం చేరికలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలో ఏనాడూ ఆదివాసీ యోధులను పట్టించుకోలేదని, గుర్తు చేశారు. రైతు సంఘం జిల్లా నాయకుడు సలం జంగు పటేల్ , బీజేపీకు చెందిన ముఖ్య నాయకుడు సిడ్మకె సుభాష్ తోపాటు జైనథ్, బేల, ఆదిలాబాద్ నుంచి సుమారుగా 550 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే జోగు రామన్న పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జై కేసీఆర్.. జై జోగు రామన్న అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసుల కోసం కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వం ఏమి చేయలేదన్నారు. హరిసుక్కా, కుమ్రం భీమ్, కుమ్రం సూరు జయంతి, వర్ధంతులను పట్టించుకోలేదని చెప్పారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూ.25కోట్లతో మ్యూజియం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అదే విధంగా జయంతి, వర్ధంతి అధికారం నిర్వహించడం, సభా కార్యక్రమాలు నిర్వహించి వారికి స్మరించుకోవడం జరుగుతున్నదన్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేశ్, మాజీ జడ్పీటీసీ ఇజ్జగిరి అశోక్, పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, వార్డు కౌన్సిలర్లు వెనుకంటి ప్రకాశ్, ఆవుల వెంకన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు సలీం పాషా, బుట్టి శి వకుమార్, దాసరి రమేశ్, భాస్కర్, సాజీదుద్దీన్, విజ్జగిరి నారాయణ ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

జైనథ్, నవంబర్ 1: మండలంలోని గూడ, రాంపూర్ గ్రామాలకు చేరిన యువకులు భారీగా బీఆర్ఎస్ లో చేరగా వారిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమం లో ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్, బీఆరస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, రైతు బంధు సమి తి మండల కన్వీనర్ ఎస్.లింగారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తం యాదవ్, సర్పంచ్‌లు ప్రభాకర్, లింగన్న పాల్గొన్నారు.

## రాజేశ్‌బాబూ.. నీచ రాజకీయాలు మానుకో..

- ఎమ్మెల్యే విఠల్ రెడ్డిపై విమర్శలు సరికాదు
- రంగరివాడ వాసులు



నిరసన తెలుపుతున్న రంగరి వాడ వాసులు

భైంసాటౌన్, నవంబర్ 1: గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకుంటూ నీచ రాజకీయాలను బీజేపీ నాయకుడు (ఏఎంసీ చైర్మన్) రాజేశ్ బాబు మానుకోవాలని, ఎమ్మెల్యే విఠల్ రెడ్డిపై చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని వాలేగాం సమీపంలోని రంగరి వాడ (గుడిసె) వాసులు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాజేశ్ బాబు మంగళవారం మాట్లాడుతూతీవ్ర ఆరోపణలు చేశారు. గిరిజన తండాలకు మంజూరైన రోడ్ల నిధులు తన కుటుంబీకుల గ్రామాలకు మళ్లించాడని ఆరోపణలు చేశాడు. వాలేగాం సమీపంలో రంగరి వాడ కాలనీ లేదని అక్కడ ఒక్క ఇల్లు కూడా లేదని, కుటుంబీకులు పొలాలకు వెళ్లడానికి రూ. 3 కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని ఆరోపించారు. దీనిపై స్పందించిన వాలేగాం రంగరి వాడ వాసులు రాజేశ్ బాబు వ్యాఖ్యలను ఖండిస్తూ గ్రామంలో 70 వరకు గిరిజన ఇండ్లు ఉన్నాయని, కాలనీలో 15 ఇండ్లు ఉన్నాయన్నారు. గ్రామం నుంచి కాలనీకి వెళ్లడానికి రోడ్డు మార్గం బాగా లేకపోవడంతో మా కాలనీకి వచ్చి కష్టాలను కళ్లరా చూసిన ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఇన్ని రోజులు బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి పొందిన రాజేశ్‌బాబు, బీజేపీ అభ్యర్థి ఇచ్చిన ప్యాకేజీకి లొంగిపోయారని ఆరోపించారు. చైర్మన్ పదవికి రాజీనామా చేయకుండా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాదిరిగా గడపగడపకూ వచ్చి కష్టాలు తెలుసుకుంటే మా బాధలు తెలుస్తాయన్నారు. మా తాత ముత్తాతల కాలం నుంచి కాలనీ ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడక ముందు రోడ్డు సౌకర్యం మాట అటుంచి విద్యుత్ సౌకర్యం కూడా లేదన్నారు. ఇక్కడ ఇండ్లు ఉంటే రాజీనామా చేస్తానని చెప్పిన రాజేశ్ బాబు, తన మాట నిలబెట్టుకోవాలన్నారు. విఠల్ రెడిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో ధర్మాజీ, నర్సింహం, కృష్ణ, నారాయణ్, వెంకటేశ్, సునీత, అనిత, సవిత, పాల్గొన్నారు.